క్లుప్తంగా

ధర్నాను విజయవంతం చేయండి

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 10వ తేదీ సోమవారం ఇందిరాపార్కు వద్ద సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు జరిగే రాష్ట్రాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ కేటాయింపులు చేస్తోందని ఆరోపించారు.

నక్కలపల్లిలో విద్యుత్ మరమ్మతులు



కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ ఏఈ హమునాయక్ ఆధ్వర్యంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు సరిచేసి, విరిగిన స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు అంజయ్యగౌడ్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

‘ఢిల్లీలో విజయంతో బీజేపీలో జోష్’

చేవెళ్ల: ఢిల్లీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయ ఢంకా మోగించడంతో కార్యకర్తల్లో జోష్ పెరిగిందని ఆ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో 26 ఏళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం కొలువుదీరడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఆప్ ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు, కుంభకోణాల కారణంగానే ఢిల్లీ ప్రజలు వారిని తిరస్కరించారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఆర్పీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తూరు: డీఆర్‌డీఏ ప్రాజెక్టులో మహిళ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ)ల పోస్టులకు ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల ఐకేపీ ఏపీఎం కొండయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసే వారి వయస్సు 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండాలని అని పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: భవన నిర్మాణ రంగ కార్మికులకు పెన్షన్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భూ పోరాట కేంద్రం సీపీఐ ఫేజ్–2లో భవన నిర్మాణ కార్మికుల మూడో మహాసభలను బీటీసీ మండల అధ్యక్షుడు రాంచందర్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా.. రామస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లేబర్ అడ్డాల వద్ద కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించి, రూ.5కే భోజనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ కార్మికులందరూ ఖచ్చితంగా లేబర్ కార్డులను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా యాదగిరి, బాబు, హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్ ఎన్నికయ్యారు. బీటీసీ సంక్షేమం కోసం సభ్యులు నిరంతరం కృషి చేయాలని రామస్వామి కోరారు. కార్యక్రమంలో బీటీసీ జిల్లా కార్యదర్శి మల్లేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సత్తిరెడ్డి, శ్రీను, మంజుల పాల్గొన్నారు.

తండాలకు మహర్దశ



ఫరూఖ్‌నగర్‌లో తండాకు వెళ్లే రోడ్డు

బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు

- ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి రూ.10కోట్లు, గిరిజన శాఖ నుంచి రూ.20 కోట్లు మంజూరు
- తొలగనున్న తండావాసుల ఇబ్బందులు

షాద్‌నగర్: గతుకుల ప్రయాణం ఇక గతించనుంది.. గుంతలుగా మారిన మట్టిరోడ్లు కనుమరుగుకానున్నాయి.. తండాలకు బీటీ రోడ్లు దర్శనమివ్వనున్నాయి.. గిరిజన తండాలకు రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం షాద్‌నగర్ నియోజకవర్గంలో పలు తండాల వెళ్లే రహదారులను బీటీరోడ్లుగా నిర్మించేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది.

గుంతలుగా మారి.. కంకర తేలి

గుంతలుగా మారి.. కంకర తేలి ఉన్న రోడ్లపై ప్రయాణించేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తండాలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ.10కోట్లు, గిరిజనశాఖ నుంచి రూ.20కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, కొందుర్గు, కొత్తూరు, కేశంపేట, జిల్లేడు చౌదరిగూడ, నందిగామ మండలాల పరిధిలో ఉన్న పలు తండాలకు బీటీరోడ్లు నిర్మించనున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ నుంచి..

గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గొల్లకుంట తండా వరకు రూ.10.50లక్షలు, బీటీ రోడ్డు నుంచి లాల్‌సింగ్ తండా వరకు రూ.10.50లక్షలు, పాత జాతీయ రహదారి నుంచి ఎర్రబిడుసు తండా వరకు రూ.14లక్షలు, జెడ్పీ రోడ్డు నుంచి గుట్టెనికి తండా వరకు రూ.10.50లక్షలు, చౌదరిగూడ మండలంలో జెడ్పీ రోడ్డు నుంచి ముష్టిపల్లి మీదుగా దాస్యాతండా వరకు రూ.14లక్షలు, గాలిగూడ నుంచి నంద్యాతండా వరకు రూ.14లక్షలు, గాలిగూడ నుంచి గన్యా తండా వరకు రూ.17.50లక్షలు, కొందుర్గు మండల పరిధిలో జెడ్పీ రోడ్డు నుంచి కొప్పుకుంట తండా వరకు రూ.7లక్షలు మంజూరయ్యాయి.

ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి..

ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి చౌదరిగూడ మండలంలో గన్యా తండా నుంచి దాస్యా తండా వరకు రూ.91లక్షలు, జెడ్పీ రోడ్డు నుంచి మన్యా తండా వరకు రూ.12.50లక్షలు, ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం నుంచి గుండ్యా తండావరకు రూ.1.61కోట్లు, జెడ్పీ రోడ్డు నుంచి ఊరెన్కి తండా వరకు రూ.54లక్షలు, కేశంపేట మండలంలో పీడబ్ల్యూ రోడ్డు నుంచి తుప్పరగడ్డ మీదుగా గుట్టల గడ్డ తండా వరకు రూ.1.52కోట్లు, పీడబ్ల్యూ రోడ్డు నుంచి నాగులగడ్డ తండా వరకు రూ.1.47కోట్లు, కొందుర్గు మండలంలో అయోధ్యాపూర్ తండా నుంచి రామన్నగూడ తండా మీదుగా బుద్ధమూర్ల తండా వరకు రూ.1.82కోట్లు, నందిగామ మండలం జాతీయ రహదారి నుంచి ధన్‌సింగ్ తండా వరకు రూ. 1.20కోట్లు, జాతీయ రహదారి నుంచి పెద్దకుంట తండా వరకు రూ.80లక్షలు మంజూరయ్యాయి.

నిధుల మంజూరు హర్షణీయం



రోడ్ల సౌకర్యం సరిగా లేకపోవడంతో ఇంత కాలం గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం తండా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం హర్షణీయం. దీంతో తండా ప్రజల ఇబ్బందులు తొలగుతాయి.

– రూప్లానాయక్, మాజీ సర్పంచ్, కేశంపేట మండలం

తండాలు మరింత అభివృద్ధి



ఎస్టీ సబ్ ప్లాన్, గిరిజన అభివృద్ధి శాఖా ద్వారా తండాలకు బీటీరోడ్ల కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడం హర్షణీయం. ఈ రోడ్ల నిర్మాణంతో తండాలు మరింత అభివృద్ధి చెందుతాయి.

– శ్రీనునాయక్, కాంగ్రెస్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు మాణిక్యం

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల హక్కులు, సమస్యలపై పీఆర్టీయూటీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు మాణిక్యం అన్నారు. పీఆర్టీయూటీఎస్ 54వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం శంకర్‌పల్లిలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. 54 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో పీఆర్టీయూటీఎస్ ఎన్నో ఘనతలను సాధించిందని గుర్తుచేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 5 డీఏలను, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్, సీపీఎస్ రద్దు, నూతన పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వ పెద్దలను కలిసి, సమస్యలను విన్నవించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఆరీఫ్ పాషా, సి.రాములు, అశ్రఫ్‌ఖాన్, కె.రాములు, బలరాం, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



షాద్‌నగర్: పూజలో పాల్గొన్న నాయకులు, స్వాములు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల సురేశ్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా శివపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కఠోరమైన దీక్ష చేపట్టి శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గురుస్వామి కమ్మరి భూపాలాచారి, నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్, మహేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో..

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో ఆదివారం పిన్నింటి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో శివపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, శివమాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గ్రామంలోని వీధులు శివనామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, నాయకులు కోస్గి శ్రీనివాస్, రాజేందర్‌గౌడ్, కృష్ణ, మోడి దర్శన్, నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్



నందిగామలో డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నందిగామలో ఘనంగా వర్గీకరణ సంబురాలు

నందిగామ: ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేపట్టడంతో పాటు ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని, పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన నందిగామలో ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. నాడు ఇందిరాగాంధీ హయాంలో భూమిలేని నిరుపేదలకు భూములు, ఇళ్లు ఇచ్చిందని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి కామారెడ్డిలో నిర్వహించిన బహిరంగ సభలో కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన మాట మేరకు రాష్ట్రంలో ఇటీవల కులగణన చేపట్టినట్లు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం సీట్లను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతేకాకుండా గత కొన్నేళ్లుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఎస్సీ వర్గీకరణ విషయమై అసెంబ్లీలో బిల్ పాస్ చేయించి వర్గీకరణ చేపట్టేందుకు శ్రీకారం చుట్టాడని వివరించారు. ఎస్సీ వర్గీకరణతో ఎస్సీలలో ఉన్న అణగారిన వారికి సైతం విద్య, ఉద్యోగాలలో ఎంతగానో మేలు జరుగుతుందని చెప్పారు. అంతకుముందు పాత జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి డప్పు వాయించారు. అనంతరం ఎస్సీ వాడలో ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా రూ.9లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, 3లక్షలతో నిర్మించే మురుగు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కావలి కృష్ణ, అంబటి ప్రభాకర్, నాయకులు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సిద్దాపూర్ శేఖర్‌రెడ్డి, లింగం, నీరటి రవీందర్, నీరటి చందన్, రాములు, గ్రామస్తులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మొయినాబాద్ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



మొయినాబాద్‌రూరల్: బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షుడిగా కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దారెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయనను రాష్ట్ర కార్యవర్గం అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 10వ తేదీ సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఆయనకు హిమాయత్‌నగర్ చౌరస్తాలో పార్టీ అధ్యక్షుడిగా నియామకపత్రం అందజేయనున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన దారెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు.

నేడు బీఆర్ఎస్ జెండావిష్కరణ

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరిస్తామని తాజా మాజీ సర్పంచ్ మంజుల, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం హిమాయత్‌నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మె వద్ద జెండా ఎగరవేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ.. కొడంగల్‌లో జరిగే కార్యక్రమానికి వెళ్తున్న కేటీఆర్ హిమాయత్‌నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు రాజు, జెల్ల మల్లేశ్, షాబాద్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్

మొయినాబాద్: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని మేడిపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో మాజీ ఎంపీటీసీ, గ్రామస్తులు సురేందర్, జంగయ్యల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో శ్రీకాంత్ జట్టు విజయం సాధించగా, రాజు జట్టు రెండో స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పి.మల్లేశ్, నాయకులు, యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

ఆమనగల్లు: లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో వెలసిన శ్రీ వేదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం.. ఆలయ ధర్మకర్తలు గూడ యాదగిరి, నర్సింహయ్య శాస్త్రి, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణరావ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, మిషన్ బగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ రజనీ, మాజీ ఎంపీపీ సీఎల్. శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ సమీపంలో నిర్మించిన మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి బోనాల ఊరేగింపులో డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్ భరత్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మాజీ సర్పంచ్‌లు మంగలి మంగారాములు, సంధ్యాశ్రీశైలం, రాజేందర్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాణిక్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుతో అభివృద్ధి

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటైనందున, ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఈగ రమాదేవి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కృషి ఎంతో ఉందన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అంతారం గ్రామంలో రూ.20లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, ఇది ప్రజా ప్రభుత్వమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చయ్య, లింగం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్, యాదయ్య, అనంతరెడ్డి, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని పెద్దవేడు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అవినీతి పాలనకు కేంద్రంలో బీజేపీ అండగా నిలిచిందని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, ఢిల్లీలో దోస్తీ.. గల్లీల్లో లొల్లి చేస్తూ నాటకాలు చేస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసగిస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, నర్సింహులు, తదితరులు ఉన్నారు.